క్లుప్తంగా

సంక్రాంతి శుభాకాంక్షలు


ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోశాలతో ఆనందంగా మూడు రోజుల పాటు సంక్రాంతి పండుగ నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

పెద్ద మకాన్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

జమ్మలమడుగు : పట్టణంలోని పలగాడీ వీధిలో ఉన్న పెద్ద మకాన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సందర్శించడంతో ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ ప్రత్యేక పూజలను నిర్వహించారు. పీఠాధిపతి మాట్లాడుతూ రామిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న ఈద్గా అభివృద్ధికి సహకరించి అలాగే టెంకాయ చేనువీధిలోని నూతన మసీదు నిర్మాణం జరిగిన దానికి సంబంధించిన బిల్లులు ప్రభుత్వం నుంచి ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బుజ్జి, కౌన్సిలర్ షామీర్ తదితరులు పాల్గొన్నారు.

సుగంధ ద్రవ్యాలతో వాసవీమాత అలంకరణ



వేంపల్లె : పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ధనుర్మాస పూజలలో భాగంగా శుక్రవారం అమ్మవారిశాలలో ఆర్యవైశ్య, ఆర్యవైశ్య యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు వాసవీ మాతను యాలక, లవంగాల సుగంధ ద్రవ్యాలతో విశేష అలంకరణ చేశారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, నైవేద్యం, ప్రాకారోత్సవం నిర్వహించి అమ్మవారికి విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య యువజన సంఘ అధ్యక్షుడు హరికృష్ణ, ఆర్యవైశ్య మహిళా మండలి ప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

వేంపల్లె : క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చునని వేంపల్లె సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సీఐ ప్రారంభించారు. ఈ టోర్నీ విజేత జట్టుకు రూ.15వేలు, రన్నర్ జట్టుకు రూ.10వేలు, మూడవ విజేత జట్టుకు రూ.8వేల నగదు బహుమతులు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, క్రీడాకారులు పాల్గొన్నారు.

17న పోస్టాఫీసులో పాసుపుస్తకాల తనిఖీ

కమలాపురం : స్థానిక పోస్టాఫీసులో ఈనెల 17 నుంచి రెండు రోజుల పాటు పాసు పుస్తకాలు తనిఖీ చేస్తామని సబ్‌డివిజన్ పోస్ట్ ఆఫీసర్ సుశీల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో కమలాపురం పోస్టాఫీసులో ఏజెంట్ ఖాతాదారులను మోసం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కమలాపురం పోస్టాఫీసులో ఖాతాదారుల పాసు పుస్తకాలు తనిఖీ చేయడానికి అధికారులు వస్తున్నారని ఆయన అన్నారు. డైరెక్ట్‌గా కానీ, ఏజెంట్ ద్వారా గాని అకౌంట్ ఓపెన్ చేసిన వారు తమ పాసు పుస్తకాలను ఈ రెండు రోజుల్లో పోస్టాఫీసుకు తీసుకువచ్చి తనిఖీ చేయించుకోవాలన్నారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి యూత్‌లాఫింగ్ ఫెడరేషన్ సంబరాలు

చెన్నూరు : మండల కేంద్రమైన చెన్నూరులో యూత్‌లాఫింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు శనివారం, సోమవారం నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ నిర్వాహకులు అద్దంకి విశ్వనాథ్, నాగార్జునరాజు, మహేష్‌లు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు పెన్నానది ఒడ్డున వెలిసిన మల్లేశ్వరస్వామి ఆలయంలో చిన్న పిల్లలకు భోగి పండ్లతో స్నానం చేయించే కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతులు ఇస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు పలు విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. 15వ తేదీ ఆదివారం ఉట్టి పగులగొట్టడం, సాయంత్రం నృత్యప్రదర్శనలు, 16న వివిధ ఆటల పోటీలు, సాయంత్రం గొబ్బెమ్మల అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించాలి

ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి


ప్రజల సమస్యను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మైలవరం (జమ్మలమడుగురూరల్) : ప్రభుత్వ పథకాలను అర్హులైన పేద ప్రజలకు అందించాలని స్థానిక ప్రజా ప్రతినిధులకు ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మైలవరం మండలంలోని దొమ్మరనంద్యాల గ్రామంలో ఆయన నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చేనేత కార్మికులను ఆదుకోవడం కోసం మగ్గం కలిగిన ప్రతి చేనేత కార్మికుడికి ఏడాదికి రూ.24 వేలు వారి ఖాతాలో వేస్తున్నారన్నారు. వలంటీర్లు నిరంతరం ప్రజల మధ్య ఉండి సంక్షేమ పథకాలు రాని వారిని గుర్తించి వారికి సహకరించాలన్నారు. ఏమైన సమస్యలు ఉంటే ప్రజలు తనకు నేరుగా ఫోన్‌చేసి సమాచారం ఇస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఎంపీపీ బి.రామయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణారెడ్డి, చేనేత నాయకుడు బడిగించల చంద్రమౌళి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభివృద్ధికి సహకరించండి

జమ్మలమడుగు : ప్రజలలో మమేకమై వారి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మైలవరం మండల కన్వీనర్లకు నిర్వహించిన సమావేశంలో సూచించారు. ఈ సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి ధన్నవాడ మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కన్వీనర్లు, గృహ సారథులు సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును ప్రజలకు వివరించడంతోపాటు పథకాలు రానివారికి ఎందుకు రాలేదన్న విషయాన్ని గుర్తించి వారికి న్యాయం జరిగేవిధంగా చూడాలన్నారు. వలంటీర్లు ఎవరైనా మన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రవర్తించినా అటువంటి వారిని గుర్తించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 175 నియోజకవర్గాలలో గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. దానికి తగ్గట్టుగా ప్రతి ఒక్కరూ పార్టీ కోసం పనిచేస్తే మరోసారి పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యకర్తలకు, నాయకులకు త్వరలో మంచి రోజులు రాబోతున్నాయన్నారు. ఈనెల చివరిలో స్టీల్‌ప్లాంట్ పనులు ప్రారంభించటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాబోతున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ పనులు ప్రారంభమైతే స్థానికులకే అత్యధిక ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. గ్రామాలలో ఉన్న నాయకులు ప్రతి రోజు వలంటీర్లతో టచ్‌లో ఉంటూ వారి చేసే కార్యక్రమాలను పరిశీలించాలన్నారు. ఆదేవిధంగా రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఎమ్మెల్సీకి పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శివగుర్విరెడ్డి, జడ్పీటీసీ మహాలక్ష్మీ, వైస్‌ఎంపీపీ శివభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రమణారెడ్డి, వైస్ చైర్మన్ చేపల సుబ్బరాయుడు, మండల కన్వీనర్ విష్ణువర్ధన్ రెడ్డి, తలమంచిపట్నం వినయ్‌కుమార్‌రెడ్డి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీకి ఇదేం ఖర్మ

- ఇదే ప్రజలందరి భావన
- సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుంటే తెలుగుదేశం పార్టీకి ఏం ఖర్మ పట్టి నిరసన కార్యక్రమాలు చేస్తోందని ప్రజలు అనుకుంటున్నారని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ సభ్యులు నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నవరత్న పథకాల పునాదులపైన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. పింఛన్ ఇచ్చే వయసును 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించి 64లక్షల మందికి రూ.2750 చొప్పున పింఛన్ ఇస్తున్నారన్నారు. విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యనందించేందుకు అమ్మ ఒడి, నాడు-నేడు, విద్యాదీవెన, గోరుముద్ద, వసతి దీవెన వంటి పథకాలు అమలు చేస్తూ రూ.54910కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. బీఆర్ అంబేడ్కర్ ఆలోచనల మేరకు సమ న్యాయం, సామాజిక న్యాయం దిశగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ 17 మందికి మంత్రి పదవులు ఇచ్చారన్నారు. సంక్షేమ పథకాలు అమలైతే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని, కోర్టులకు పోయి అడ్డుకున్న చరిత్ర చంద్రబాబుదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల వల్లే నిత్యావసర ధరలు పెరిగాయని, రాష్ట్ర ప్రభుత్వానికి ఇందులో ఏం సంబంధముందని ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేష్‌లు పాదయాత్ర చేసినా, బస్సుయాత్ర చేసినా, పొర్లుదండాలు పెట్టినా టీడీపీ అధికారంలోకి రాదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త చరిత్ర సృష్టిస్తే, చంద్రబాబు రాష్ట్రానికి ఏమీ చేయకుండా చరిత్ర హీనుడిగా మిగిలిపోయారన్నారు. ఆత్మఘోష, కంఠశోష తప్పా వారికేం మిగలదని ఎద్దేవా చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, పార్టీ నాయకులు సుబ్బరాయుడు, క్రిష్ణయ్య, శ్రీనివాసులు, శ్రీనుయాదవ్ పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి పడిపూజ

పులివెందుల టౌన్ : పట్టణంలోని కోతి సమాధి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఉన్న హరిహర పుత్రుడు అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వెంకటరామిరెడ్డి గురుస్వామి తెలిపారు. మకరసంక్రాంతి పర్వదినం సందర్భంగా శబరిమలై అయ్యప్పస్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు పడిపూజ ఉంటుందన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల టౌన్ : జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన హౌసింగ్ అధికారులు, సిబ్బందికి ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాలనీలో మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిర్దేశించిన సమయంలో ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కాలనీలో నీటి సరఫరా పైపులైన్ పనులు, యూజీడీ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ గుర్రప్పయాదవ్, హౌసింగ్ డీఈ, హౌసింగ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. చెన్నూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, గతంలో ఎన్నడూలేని విధంగా వైద్యరంగానికి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో 104 ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందే విధంగా ఫ్యామిలీ ఫిజిషియన్(ఫ్యామిలీ డాక్టర్)చే వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టారన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు తగినంత మంది వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించడమే కాకుండా మెరుగైన వైద్య వసతులు కల్పించారన్నారు. చెన్నరులో పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు ఒకేచోట ఉండటంతో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రస్తుతం పీహెచ్‌సీని కొత్తగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లోకి మార్చడం ద్వారా కొండపేట, ఇటు చెన్నూరుటౌన్ వాసులకు ఇబ్బందులు లేకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, అడిషనల్ డీఎంహెచ్ఓ ఉమామహేష్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్‌ఆర్, పార్టీ చెన్నూరు టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్‌ఆర్, పీహెచ్‌సీ వైద్యాధికారులు, మైనార్టీ నాయకులు, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాల సేవలను విస్తృతం చేయాలి


రాజశేఖర్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డిలను సన్మానిస్తున్న ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు అందించాలని సత్సంకల్పంతో ఏర్పాటు చేసిన సచివాలయాల సేవలను విస్తృతం చేయాలని రాష్ట్ర ఉద్యాన సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డిలు తెలిపారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు కమలాపురం మండల సచివాలయాల కన్వీనర్ల సంఘం మండల కన్వీనర్‌గా సుమిత్రా రాజశేఖర్‌రెడ్డిని, పట్టణ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడిగా నిఖిల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం ఆశయ సాధనకు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకుంటే తక్షణం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, మస్తానయ్య, రామసుబ్బారెడ్డి, మర్రి సుబ్బన్న, చిన్ని, మైసూరారెడ్డి, సురేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ అభిమానులు పాల్గొన్నారు.

పరామర్శ


యశ్వంత్‌రెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎర్రబల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డి కుమారుడు యశ్వంత్‌రెడ్డిని శుక్రవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బలరామిరెడ్డి, గంగిరెడ్డి, డిష్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్ పిచ్చి కూతలు'

పులివెందుల రూరల్ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు డైరెక్షన్‌లోనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిచ్చి కూతలు కూశారని పీసీబీ రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం పులివెందులలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులపై పవన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన తీవ్రస్థాయిలో ఖండించారు. ఉత్తరాంధ్ర కాపులను చంద్రబాబుకు తాకట్టు పెట్టే యోచనలో పవన్ ఉన్నారన్న మాట ఆయన వ్యాఖ్యలు రుజువు చేశాయన్నారు. ఇక రాష్ట్రంలో అతి పెద్ద సైకో ఎవరైనా ఉన్నారా అంటే ఇది దత్త పుత్రుడేనని ప్రజలకు బాగా అర్థమైందన్నారు. రాబోవు ఎన్నికలలో తాను ఒంటరిగా పోటీ చేసి గెలవలేనన్న సంకేతాన్ని తానంతకు తానే ఒప్పుకున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్, మంత్రులపై విమర్శలు చేస్తూనే బూతులు మాట్లాడటం పవన్ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా పవన్ నోరు అదుపులో ఉంచుకుంటే మంచిదని హితవు పలికారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య

లింగాల : పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య అన్నారు. శుక్రవారం లింగాల పీహెచ్‌సీ పరిధిలోని ఇప్పట్ల గ్రామంలో ఫ్రై డే - డ్రై డే కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి నీటి నిల్వలు ఉన్న నీటి తొట్లలో అబేట్‌ను పిచికారి చేసి మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కొరకు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలని, జ్వరాలు వచ్చినట్లయితే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, స్వర్ణ, ఎంఎల్‌హెచ్‌పీ చందన, ఆశా కార్యకర్త పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ గేమ్స్‌కు గురుకుల కళాశాల విద్యార్థిని


నిహారికను అభినందిస్తున్న పీఈటీ నిఖిల

లింగాల : ఇప్పట్ల గ్రామ సమీపంలోని బాలయోగి ప్రతిభ గురుకుల కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని కె.నిహారిక నేషనల్ నెట్ బాల్ పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ రామచంద్రన్ తెలిపారు. ఈనెల 11, 13వ తేదీలలో నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-19 విభాగంలో 66వ ఇంటర్ డిస్ట్రిక్ స్టేట్ లెవెల్ నెట్ బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి నేషనల్ పోటీలకు ఎంపికైన నిహారికను కళాశాల పీఈటీలు, కళాశాల సిబ్బంది అభినందించారు.

రైతులు ఈ-క్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలి


మాట్లాడుతున్న అరవిందనాథరెడ్డి

సింహాద్రిపురం : ప్రతి రైతు తాము వేసిన పంటలకు ఈ-క్రాప్, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ సలహా మండలి సలహాదారుడు అరవిందనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం సింహాద్రిపురం సచివాలయం-1 పరిధిలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. రైతులు వైఎస్సార్ అగ్రి టెస్ట్ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్ అగ్రిటెస్ట్ ల్యాబ్ ఏఓ సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు, భూసార పరీక్షలను వీహెచ్‌ఏలకు అందిస్తే ఉచితంగా పరీక్ష నివేదికలు అందిస్తారన్నారు. ఎరువుల డీలర్లు తప్పనిసరిగా తమ షాపులో విక్రయించే మందులు, విత్తనాలు ఈ ల్యాబ్ టెస్ట్‌లో రూ.300లు కట్టి పరీక్షలు చేయించుకుని నాణ్యతా పరీక్ష పత్రం షాపులో ఉంచుకోవాలన్నారు. రైతులు కూడా ఆన్‌లైన్ వ్యవసాయ పరికరాలు కొనవద్దని.. అగ్రిటెస్ట్ పత్రం ఉన్న షాపులలో మాత్రమే కొనుగోలు చేస్తే మోసపోకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ రాష్ట్ర మెంబర్ శివప్రసాద్‌రెడ్డి, ఏఓ శివమోహన్‌రెడ్డి, హెచ్‌ఓ మల్లేశ్వరరెడ్డి, సచివాలయ వీహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకు స్థల పరిశీలన


ఎంపోరియం ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న చైర్మన్ బడిగించల విజయలక్ష్మి

జమ్మలమడుగు : పట్టణంలో లేపాక్షి ఎంపోరియంను త్వరలో ఏర్పాటుచేసి చేనేత వృత్తులతో తయారు చేసిన వాటికి మార్కెట్ కల్పించడం జరుగుతుందని ఏపీహెచ్‌డీసీ చైర్మన్ బడిగించల విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె పట్టణంలోని వైఎస్సార్ కూరగాయాల మార్కెట్‌తోపాటు, మీసేవ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో హస్తకళలకు సంబంధించిన వస్తువుల స్టాల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి చేనేత కళాకారులకు ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం జమ్మలమడుగు, గండికోట ప్రాంతాలలో లేపాక్షి ఎంపోరియంలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హస్త కళల అభివృద్ధికి ఎంతో సహకరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, మేనేజర్ తిమ్మయ్య, తదిరులు పాల్గొన్నారు.

పశుగ్రాసానికి పెరిగిన డిమాండ్


పెద్దపసుపుల గ్రామంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పశుగ్రాసం

పెద్దముడియం : గతంలో ఎన్నడూ లేనివిధంగా ట్రాక్టర్ వరిగడ్డి పశుగ్రాసానికి డిమాండ్ పెరిగింది. ట్రాక్టర్ వరిగ్రాసం రూ.13 వేల నుంచి రూ.15 వేల ధర పలుకుతోందని రైతులు చెబుతున్నారు. గతంలో రైతులు ఎకరం పశుగ్రాసం రెండు నుంచి మూడు వేలకు విక్రయించేవారు. కాని ఇప్పుడు కర్నూలు జిల్లాలోని చాగలమర్రి ప్రాంతంలోని వ్యాపారులు వరి గ్రాసాన్ని కొనుగోలు చేసి ట్రాక్టర్లలో తీసుకువచ్చి మండలంలోని పలు గ్రామాల్లో విక్రయిస్తున్నారు. మండలంలో శనగ పంట ఎక్కువగా సాగులో ఉండడం, వరి పంట తక్కువగా ఉండడంతో పశుగ్రాసానికి డిమాండ్ ఏర్పడినట్లు రైతులు చెబుతున్నారు. పశుగ్రాసం కొనుగోలు, ట్రాక్టర్ బాడుగ, కూలీల ఖర్చుపోను వ్యాపారులకు ట్రాక్టర్‌పై రూ.2 లేదా 3 వేలు మిగులుతున్నట్లు విక్రయదారులు తెలుపుతున్నారు.

ఫ్లెక్సీలపై నిషేధాన్ని తొలగించండి

ప్రొద్దుటూరు : ఫ్లెక్సీలపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని తొలగించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి సృజన శ్రీను, సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడారు. ప్రభుత్వం విధించిన ఫ్లెక్సీల నిషేధం వల్ల నిరుద్యోగులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో శుక్రవారం తొండూరు మండలం గోటూరులోని ఆర్‌సీఎం ఉన్నత పాఠశాలకు చెందిన 1998వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆత్మీయంగా పలకరించుకుని అప్పటి గురువులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాసులరెడ్డి, గీతాంజలి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రఓబుళరెడ్డి, కళ్యాణి, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ఇచ్చి గెలిపించండి

చెన్నూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం చెన్నూరులో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లినిక్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని కలిసి మద్దతు కోరారు. అనంతరం ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌ను మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులను కలిసి మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జీఎన్ భాస్కర్‌రెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీటీసీలు దుంపా నాగతిరెడ్డి, ఎర్రసాని నిరంజన్‌రెడ్డి, ఆకుల ప్రసాద్‌బాబు, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ గోదాదేవి కల్యాణోత్సవం

కడప కల్చరల్ : ధనుర్మాసం ముగింపునకు వస్తున్న సందర్భంగా శుక్రవారం కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి, స్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొలుత మూలమూర్తులతోపాటు ఉత్సవ మూర్తులకు కూడా విశేష అభిషేకాలు చేసి వధూవరులుగా అలంకరించి పెళ్లిపీటలపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ బృందం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరైన భక్తులు కార్యక్రమం ముగిసేంతవరకు విష్ణు సహస్ర నామ పారాయణం చేయడం విశేషం.

రేపు కాలాష్టమి పూజలు

కడప కల్చరల్ : బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత గ్రామం మగ్దూం సాహెబ్ కొట్టాలలో ఆదివారం శ్రీఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నామని బాసట సంస్థ అధ్యక్షులు బాలాజీరావు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 8గంటలకు అభిషేకం, అష్టోత్తరం, కుష్మాండ సేవ తదితర పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వేలము ప్రకటన

కడప జిల్లా, సింహాద్రిపురం (మం.), అహోబిలాపురం గ్రామంలో వెలసిన శ్రీ భానుకోట సోమేశ్వరస్వామి దేవస్థానమునకు సంబంధించి తలనీలాలు పోగుచేసుకొను హక్కు, టెంకాయలు అమ్ముకొను హక్కులకు గాను 18.01.2023వ తేదీ ఉదయం 10.00 గం॥లకు దేవస్థానము వద్ద బహిరంగ వేలంపాట నిర్వహించబడును. తలనీలాల పాటకు రూ.20,000/-, టెంకాయల వేలం పాటకు రూ. 5,000/-లు ధరావతు చెల్లించవలయును. తక్కిన వేలంపాట షరతులు వేలం రోజు తెలుపబడును.

ఇట్లు: కార్యనిర్వహణాధికారి మరియు గ్రామ పెద్దలు